చెట్లల్లోనే మాగి పగిలిపోతున్న తోతాపురి మామిడి

మూడు రోజులుగా మామిడికాయల లోడుతో క్యూలో నిలిచిన ట్రాక్టర్లు

తోతాపురి రైతులకు

తప్పని తిప్పలు

- రాజకీయ పలుకుబడి ఉన్న వారికే టోకన్లు..
- కిలోమీటర్ల కొద్దీ ఫ్యాక్టరీల వద్ద ట్రాక్టర్లు
- క్యూలో రోజుల తరబడి రైతుల పడిగాపులు
- కనీస మద్దతు ధరపై చేతులెత్తేసిన ప్రభుత్వం..

మామిడి ధరలు జిల్లాలో రోజురోజుకు పతనం అవుతుండడంతో అన్నదాతల కష్టాలు చూస్తుంటే గుండె తరుక్కుపోతుంది. కళ్ళముందే కాయలు తోటలోనే రాలిపోతుంటే మామిడి రైతుల ఆశలు కూలిపోతున్నాయి. తోతాపురి మామిడి మద్దతు ధర ప్రశ్నార్థకంగా మారింది. తోతాపురి కిలో 8 రూపాయలు కొనాలని కంపెనీలకు చెబుతున్నా.. పక్కాగా దాన్ని అమలు చేయడం లేదు. మరోవైపు చిత్తూరు జిల్లా ర్యాంపుల్లో కిలో కాయ మూడు రూపాయలు పలకని వైనం నెలకొంది. ఈ నేపథ్యంలో తోతాపూరి రైతులు ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

చిత్తూరు జిల్లా గుడిపాల మండలం ఫుడ్ అండ్ పల్ప్ ఫ్యాక్టరీ సమీపంలో రెండు కిలోమీటర్ల మేర రోడ్డు కిరువైపులా రైతులు అధిక సంఖ్యలో మామిడికాయల ట్రాక్టర్లతో క్యూలైన్లో వేచి ఉన్నారు. వీరికి సరైన వసతులు కల్పించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. క్యూ లైన్‌లో రెండు మూడు రోజులుగా వేచి ఉండాల్సిన పరిస్థితి. ఉద్యాన శాఖ అధికారులు సరైన చర్యలు చేపట్టలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆదివారం గుడిపాల మండలం మ్యాంగో జ్యూస్ ఫ్యాక్టరీ వద్ద రెండు కిలోమీటర్ల మేర మామిడికాయల లోడ్‌తో బారులుతీరిన ట్రాక్టర్లు ,లారీలు

ప్రజాశక్తి- యాదమరి (చిత్తూరు): చిత్తూరు జిల్లాలో తోతాపరి మామిడి ధరలు పాతాళానికి పడిపోయాయి. ర్యాంపుల్లో రూ.3లకు మించి కొనుగోలు చేయడం లేదు. ఫ్యాక్టరీలలో కేజీ రూ.5నుంచి 6లకు మాత్రమే తీసుకుంటున్నారు. ప్రభుత్వం తోతాపూరి మద్దతు ధర కేజీ రూ.8లుగా నిర్ణయించింది. ప్రభుత్వం ప్రోత్సాహం నిధికి కేజీకి రూ.4లు ఇస్తామని ప్రకటించింది. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే కొనాలని ఫ్యాక్టరీ యాజమాన్యంకి ఆదేశాలిచ్చారు. కానీ క్షేత్రస్థాయిలో ఈ మద్దతు ధర అమలు కావడం లేదు.

సిండికేట్‌తో సమస్య..కేజీ 3 రూపాయలే

మామిడి గుజ్జు పరిశ్రమల యజమాన్యాలు, వ్యాపారులు, దళారులు, సిండికేట్ కావడంతో తోతాపూరి పంటను అమ్ముకోలేకుండా రైతులు పడరాన్ని పాట్లు పడుతున్నారు. గుజ్జు పరిశ్రమలు ర్యాంపుల్లో టన్ను రూ.8వేలకు కొనాలని ప్రభుత్వం ఆదేశించినప్పటికీ ఇది ఎక్కడ అమలు కావడం లేదు. తోటల్లో పక్కానికి వచ్చిన కాయలను ర్యాంపుల వద్ద స్వలాభం కోసం సిండికేట్‌గా మారిన దళారులు రైతులను నయానోభయానో ఒప్పించి రైతుల వద్ద నుంచి రూ.3లకు కొనుగోలు చేసి గుజ్జు పరిశ్రమలకు రూ.6లకు సరఫరా చేస్తున్నారు. ఇలా ఫ్యాక్టరీ యజమానులు, వ్యాపారులు, దళారులు సిండికేట్‌గా మారి రైతుల కడుపు కొడుతున్నారు. ర్యాంపుల వద్ద తోలుతున్న రైతులకు మామిడి కోసే కోతకూలీ, రవాణా ఖర్చులు కూడా దక్కడం లేదని, ఈసారి ఏమాత్రం గిట్టుబాటు కావడం లేదని రైతులు కన్నీటిపర్యంతం అవుతున్నారు.

ఫ్యాక్టరీ వద్ద క్యూలో రోజుల తరబడి వందలాది వాహనాలు

మామిడి కాయలను జ్యూస్ ఫ్యాక్టరీకి తోలేందుకు వందల సంఖ్యలో రైతులు ఫ్యాక్టరీ వద్దకు మామిడి కాయలను ట్రాక్టర్లతో తీసుకొచ్చారు. అయితే సరైన మద్దతు ధర కల్పించని కారణంగా తెచ్చిన కాయలను ఇంటికి తిరిగి తీసుకెళ్లలేక అయినకాడికి తెగనమ్ముకోలేక వచ్చిన వాహనాల్లోనే క్యూ లైన్‌లో రెండు, మూడు రోజులుగా ఫ్యాక్టరీల వద్ద వేచి చూస్తున్నారు. దీంతో ఫ్యాక్టరీల వద్ద, ఫ్యాక్టరీ సమీపంలోని కిలోమీటర్ల లారీలు, ట్రాక్టర్లు, నిలిచిపోయాయి. గత మూడు రోజులుగా ఇటు ముందుకు వెళ్లలేక వెనక్కి కదలి లేక అలాగే రోడ్ల వెంబడి నిలిచిపోయాయి.

మూడు రోజులుగా ఫ్యాక్టరీ వద్ద క్యూలో ఉన్నా..

- గోపాల్ రెడ్డి , రైతు, ఆరిమాకులపల్లి, యాదమరి మండలం

తోతాపూరి మామిడిని ఫ్యాక్టరీకి తీసుకొచ్చాం. మామిడి కాయలు ట్రాక్టర్ లోడ్‌తో ఫ్యాక్టరీ వద్దనే మూడు రోజులుగా క్యూలో ఉన్నాం. ఇంతవరకు ఫ్యాక్టరీలోని అనుమతించలేదు. రాజకీయ పలుకుబడి ఉన్న వారికి మాత్రమే వెంటనే లోనికి అనుమతిస్తున్నారు. సామాన్య రైతులకు న్యాయం జరగడం లేదు. పలుకుబడి ఉన్న వారికి మాత్రమే ప్రాధాన్యతిస్తున్నారు. గత నాలుగు రోజులుగా ఉండడంతో టాక్టర్ లోనే మామిడికాయలు మాంగిపోతున్నాయి. బాగా మాంగిపోతే ఫ్యాక్టరీ యజమానులు లోడింగ్ చేసుకోకుండా వెనుక్కు పంపిస్తున్నారని భయంగా ఉంది..

పెట్టిన పెట్టుబడి కూడా రాలేదు..

- మనోహర్ యాదవ్, రైతు, మాదిరెడ్డిపల్లి, యాదమరి మండలం

మాకు రెండు ఎకరాల పొలం ఉంది. ఫ్యాక్టరీలకు మామిడి కాయలు తోలుదామని టోకెన్లకు వారం రోజులు తిరిగాం.. అయిన టోకన్లు దొరకలేదు. బయట మామిడ ి కాయలు మండీకి తోలుదామని చెప్పేసి ర్యాంపు వద్దకు వెళ్తే కిలో రూ.3లకు అడుగుతున్నారు. మూడు రూపాయలకి మామిడికాయలు ఇచ్చామంటే కోత కూలి రవాణా ఖర్చులు కూడా రావు. చేతిలో నుంచి వేసుకోవలసిన పరిస్థితి. ఇప్పటికే మామిడికాయలు పక్వానికి వచ్చి తోటల్లోనే రాలిపోతున్నాయి. అందువల్లనే మామిడికాయలు కోయకుండా గిట్టుబాటు ధర కోసం ఎదురుచూస్తున్నాం. మామిడి వల్ల ఈసారి పూర్తిగా నష్టపోయాం.

శనివారం మద్దతు ధర ఇవ్వాలని కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతు సంఘాల నాయకులు (ఫైల్ ఫోటో)

కిలో రూ.6లకు తగ్గకుండా చూస్తాం: జెసి

రైతులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ విద్యాధరి

తోతాపురి మామిడి కాయలకు కిలో రూ.6లకు తగ్గకుండా చూస్తామని తవణంపల్లి మండలంలో జ్యూస్ ఫ్యాక్టరీ పరిశీలించిన సందర్భంగా రైతులతో జిల్లా కలెక్టర్ విద్యాధరి చెప్పారు. కిలో మామిడిని రూ.6లకు కొనేలా ట్రాన్స్పోర్ట్ కమిటీని వేస్తామని తద్వారా మామిడి రైతులకు ఇబ్బంది లేకుండా చూసే విధంగా చర్యలు తీసుకుంటామని జెసి తెలిపారు.

రైతు పొలంలో చెట్లలోని మాంగిపోతున్న మామిడి కాయలు

రేపు వైసిపి ఆధ్వర్యంలో మహాధర్నా

ఎప్పుడూ లేని విధంగా మామిడి పంట రాబడి మీద ఆశలు పెట్టుకున్న రైతులకు చివరికీ నిరాశే మిగిలిందని, సరైన మద్దతు ధర ఇవ్వడంలో, రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చిత్తూరు జిల్లా వైసిపి అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి సూచనలతో ఈనెల 24న బంగారుపాళ్యంలోని మ్యాంగో మార్కెట్ యార్డు ఎదుట మహాధర్నా నిర్వహించనున్నట్లు పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఉద్యానశాఖ అధికారుల కుంటి సాకులు...

చిత్తూరు జిల్లాలో మావిడి రైతుల ఆందోళన నేపథ్యంలో ఉద్యాన శాఖ అధికారులు తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. కాయలు పక్వానికి రాకుండానే కోతలు కోయడంతోనే ఇబ్బందులు తలెత్తుతున్నాయని మద్దతు ధరకు మంగళం పాడుతున్నారు. అధికారుల తీరుపై జిల్లా రైతులు, రైతు సంఘాల నాయకులు భగ్గుమంటున్నారు.

కౌలు రైతు ఆత్మహత్య

కౌలు రైతు వెంకటరమణ (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి -పుంగనూరు చేసిన అప్పులు తీర్చలేక ఓ కౌలు రైతు మృతి చెందిన సంఘటన పుంగనూరులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం బోడేవారి పల్లి పంచాయతీ ఈడిగపల్లెకి చెందిన బుడ్డన్న కుమారుడు వెంకటరమణ (48) ఎకరా పొలం కౌలుకు తీసుకొని అప్పుచేసి టమాటా పంట సాగు చేశారు. మార్కెట్‌లో టమాటాకు గిట్టుబాటు ధరలు లేక, చేసిన అప్పు తీర్చలేక ఆదివారం ఉదయం చెట్టుకు ఉరి వేసుకుని మరణించాడు. లాభాలు వస్తాయని రూ.1.50లక్షలు అప్పు చేసిన సాగు చేసిన టమాటా పంటకు పెట్టిన పెట్టుబడి కూడా రాకపోవడంతో తీసుకున్న అప్పు ఎలా తీర్చాలని మనోవేదన ఓ వైపు, కుటుంబ పోషణ , పిల్లల చదువు కోసం చేసిన రూ.2.50లక్షలు అప్పులు ఎలా తీర్చాలో దిక్కుతోచక చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేమాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

నేడు కలెక్టరేట్‌లో పిజిఆర్ఎస్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో 23వ తేదీ సోమవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, డివిజనల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. అర్జీదారులు వారి అర్జీలను మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్సైట్‌లో కూడా నమోదు చేసుకోవచ్చు అని తెలిపారు. అలాగే వారి అర్జీల నమోదు, నమోదైన అర్జీల గురించి వాటి స్థితికి సంబంధించి ఇన్ఫర్మేషన్ ఏమన్నా తెలుసుకోవాలన్నప్పుడు 1100కి నేరుగా కాల్ చేయవచ్చని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

స్పందించని ప్రభుత్వం.. కొనసాగుతున్న నిరసనలు

7 రోజుకు చేరిన దీక్షలు

ప్రజాశక్తి -పుంగనూరు: మున్సిపాలిటీలో ఇంజనీరింగ్ విభాగంలో ఒప్పంద కార్మికుల చేపట్టిన దీక్షలపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడంతో నిరసనలు కొనసాగిస్తున్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ఒప్పంద కార్మికులు ఆదివారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కార్మిక సంఘ నాయకులు మాట్లాడుతూ దీర్ఘకాలిక సమస్యలు ప్రభుత్వం పరిష్కరించకపోవడంతో గత వారం రోజులుగా నిరసన దీక్షలు కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. మున్సిపల్ రంగంలో ఒప్పంద కార్మికులు టెక్నికల్‌కు నెలకు రూ.29200, నాన్ టెక్నికల్ సిబ్బందికి రూ.24500లు వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్ల తరబడి సమస్యల పరిష్కారం కోసం వివిధ రూపాల్లో ఆందోళన చేస్తున్న ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ఒప్పంద కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద రిటైర్డ్ అయిన కార్మికులకు రూ.10లక్షలు, నెలకు రూ.10వేలు పింఛన్ ఇవ్వాలన్నారు. అలాగే కారుణ్య నియామకాలు అమలు చేయాలని, రిటైర్డ్ అయిన కార్మికులకు గ్రాడ్యుటీ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు రెడ్డిపల్లి శ్రీరాములు, శివకుమార్, ప్రసాద్, నంజ ఆచారి, సూర్యనారాయణ, సోమశేఖర్, చెన్న కేశవులు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఒప్పంద కార్మికులు

పోలీస్ మృతుల కుటుంబాలను ఆదుకుంటాం: ఎస్పీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లా స్పెషల్ బ్రాంచ్‌లో విధులు నిర్వహిస్తూ ఈనెల 21వ తేదీ అనారోగ్యంతో మరణించిన కానిస్టేబుల్ ఎస్.మురళీ కృష్ణ అంత్యక్రియలు ఆదివారం చిత్తూరు పట్టణంలో జరిగాయి. ఈసందర్భంగా మృతిని భార్య మల్లీశ్వరికి జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాల మేరకు రూ.లక్ష రూయాలు అందించారు. పోలీస్ శాఖ తరపున ఫ్లాగ్ ఫండ్ రూపంలో రూ.25,000, విడో ఫండ్ రూ.50,000లు, అంత్యక్రియల ఫండ్ రూ.25,000లు కలిపి మొత్తంగా లక్ష రూపాయలను అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ ఎస్ఆర్.రాజశేఖర రాజు, చిత్తూరు ఎస్.బి. ఇన్స్పెక్టర్ మనోహర్, చిత్తూరు జిల్లా పోలీసు అసోసియేషన్ ప్రెసిడెంట్ ఉదయ్‌కుమార్ అసోసియేషన్ సభ్యుల సమక్షంలో అందజేశారు. చిత్తూరు పోలీస్ శాఖ పోలీసు కుటుంబాలకు ఎప్పుడూ అండగా ఉంటుందని, పోలీసు సిబ్బందికి ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడినప్పుడు, వారి కుటుంబ సభ్యులకు తగిన విధంగా సహాయాన్ని అందించడానికి పోలీస్ శాఖ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని వారు తెలిపారు. పోలీస్ కుటుంబాల సంక్షేమం పోలీస్ శాఖకు అత్యంత ప్రాధాన్యం కలిగినదని, అవసరమైనపుడు శాఖ పూర్తిగా అండగా ఉంటుందని పేర్కొన్నారు.

మృతుని భార్యకు పోలీస్ ఫండ్ అందజేస్తున్న అడిషనల్ ఎస్పీ రాజశేఖర్ రాజు

రైతులకు గిట్టుబాటు ధర ఎక్కడ..?: పెద్దిరెడ్డి

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి- పుంగనూరు: వ్యవసాయమే దండగని చెప్పిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇక రైతులకు ఏమి మేలు చేస్తాడని పంటలకు గిట్టుబాటు ధరలు ఉండవని రాష్ట్ర మాజీ మంత్రి స్థానిక ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మున్సిపల్ కార్యాలయంలో దివ్యాంగులకు ట్రై సైకిల్లును పంపిణీ చేశారు. అనంతరం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో టమాటా రైతులు, మామిడి రైతులు కోట్లల్లో నష్టపోయారని చెప్పారు. మామిడి తోతపురి కిలో రూ.2,3లు ధరలు ఉంటే రైతులు ఎలా బతకాలని ప్రశ్నించారు. చంద్రబాబు నాయుడువి అన్ని బూటకు మాటలు అని, ఎన్నిసార్లు చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయిన రైతులకు పట్టించుకోడని విమర్శించారు. ఇలాంటి ముఖ్యమంత్రి ఈ రాష్ట్రాన్ని పరిపాలిస్తుంటే రైతులకు గిట్టుబాటు ధరలు ఎక్కడ వస్తాయన్నారు. రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించేందుకు జగన్మోహన్ రెడ్డి వెళుతుంటే వైసీపీ నాయకులను వేధిస్తున్నారని, గతంలో రైతులు క్రాప్ హాలిడే అని పెట్టారని, ఇక నాలుగు సంవత్సరాలు రైతులు సెలవులో ఉండాల్సిందే అని ఎద్దేవా చేశారు. ఇది రైతులకు చేయూత ఇచ్చే ప్రభుత్వం కాదని గిట్టుబాటు ధరలు లేకుండా రైతులు అవస్థలు పడుతుంటే చంద్రబాబు నాయుడు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హలీం బాష, నాగభూషణం, ఎంపీపీ అక్కిసాని భాస్కర్ రెడ్డి, జయరామిరెడ్డి, కౌన్సిలర్ అమ్ము, అస్లాం మురాది, రాజేష్, వహాబ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్త మృతి

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: పుట్టినరోజు నాడు శ్రీవారిని దర్శించుకుని, భార్య పిల్లలతో కలిసి ఆనందంగా ఇంటికి వెళ్తున్న ఓ జవాన్ జీవితం అర్థాంతరంగా ఆగిపోయింది. రోడ్డు ప్రమాదంలో భార్యతోపాటు తాను అసువులు బాసిన విషాదకర ఘటన ఆదివారం చంద్రగిరి నియోజకవర్గంలో చోటు చేసుకుంది. పోలీసులు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చిత్తూరు జిల్లా గుడిపాల మండలం కుప్పిగానేపల్లి రామాపురానికి చెందిన సిద్ధయ్య ఆర్మీ జవానుగా విధులు నిర్వహించారు. చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి అంగ రక్షకుడుగా (గన్‌మాన్) కొంత కాలం పనిచేశాడు. జూన్ 22వ తేదీ ఆదివారం అతని పుట్టినరోజు కావడంతో భార్యా ఇద్దరు పిల్లలతో కలిసి శనివారమే తిరుమలకు చేరుకున్నారు. ఆదివారం ఉదయం శ్రీవారి దర్శనం అనంతరం కారులో సొంతూరు గుడిపాలకు బయలుదేరారు. చంద్రగిరి మండలం తూర్పుపల్లి వద్ద వేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి పక్కనున్న డివైడర్ను ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ముందుభాగం నుజ్జునుజ్జు అవ్వడంతో మంటలు వ్యాపించాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు హుటాహుటిన అక్కడికి చేరుకొని మంటల్లో చిక్కుకున్న నలుగురిని అతికష్టం మీద వెలికి తీశారు. అయితే అప్పటికే జవాన్ సిద్ధయ్య (40) మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన ఆయన భార్య జ్యోతి(36)ని చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందింది. వారి కుమార్తె, కుమారుడు ఇద్దరనీ రుయాకి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదానికి గురైన కారు మంటల్లో పూర్తిగా దగ్ధమైంది. జాతీయ రహదారిలో రోడ్డు ప్రమాదం జరగడంతో వాహనాలు రోడ్డుకి ఇరువైపు పూర్తిగా నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని, ప్రమాద తీవ్రతను పరిశీలించారు. మృతుడి వద్ద దొరికిన ఆధార్ కార్డు ఆధారంగా అతను మాజీ జవాన్ సిద్ధయ్య అని, మాజీ ఎమ్మెల్యేకు గన్‌మాన్‌గా విధులు నిర్వహించాలని గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

డివైడర్‌ను ఢీకొని దగ్ధమౌతున్న కారు

మృతి చెందిన సిద్దయ్య

మృతి చెందిన సిద్దయ్య భార్య జ్యోతి

టీటీడీ కి ఏసి బస్సు విరాళం



ప్రజాశక్తి- తిరుమల

ఆటో మొబైల్ కంపెనీ, అశోక్ లేలాండ్ టిటిడికి ఒక 41-సీటర్ ఏసి బస్సును ఆదివారం విరాళంగా అందించింది. సుమారు రూ. 35 లక్షల విలువైన ఈ బస్సును అశోక్ లేలాండ్ ఎం అండ్‌హెచ్‌సివి అధ్యక్షుడు సంజీవ్ కుమార్ శ్రీవారి ఆలయం ముందు టిటిడికి అందజేశారు. సాధారణంగా ప్రతి ఏడాది అశోక్ లేలాండ్ కంపెనీ వారు టిటిడికి ఒక ఆటోమొబైల్ వాహనాన్ని విరాళంగా అందిస్తుంది. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, తిరుమల డిపో డిఐ వెంకటాద్రి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా ఎన్నికైన టిడిపి ఎస్సి సెల్ మండల కమిటీ సభ్యులు

ఎస్సి సెల్ మండల కమిటీ ఎన్నిక ఏకగ్రీవం

ప్రజాశక్తి- పూతలపట్టు: పూతలపట్టు మండల టిడిపి ఎస్సి సెల్ కమిటీని ఆ పార్టీ మండల అధ్యక్షులు దొరబాబు చౌదరి ఆధ్వర్యంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎస్సి సెల్ మండల అధ్యక్షులుగా మంజునాథ్, ఉపాధ్యక్షులుగా దుర్వాసులు, ప్రధాన కార్యదర్శిగా హరి, కార్యనిర్వాహక కార్యదర్శిగా శ్రీధర్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో చంద్రమౌళి, దళిత నాయకులు పాల్గొన్నారు.

ఆర్‌కె రోజా మేనల్లుడి ప్రతిభ

ప్రజాశక్తి -విజయపురం (నగరి) : టాప్ గ్లోబెల్ యూనిర్సిటీల్లో ఇంజనీరింగ్ చదవడానికి నిర్వహించే ప్రపంచ యూనివర్సిటీ ర్యాంకింగ్‌లో మాజీ మంత్రి ఆర్కే రోజా మేనల్లుడు, ఆమె పెద్ద సోదరుడైన కుమారస్వామి కుమారుడు నిఖిల్‌వర్ధన్ రెడ్డి ప్రతిభ కనభరిచాడు. ప్రపంచ స్థాయి యూనివర్సిటీ ర్యాంకింగ్‌లో 94.2 స్కోర్ సాధించి 11వ స్థానంలోను, ఆసియా యూనిర్సిటీ ర్యాంగింగ్స్‌లో 99.7 స్కోర్ సాధించి 2వ స్థానంలోను నిలిచాడు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన హాంకాంగ్ యూనివర్సిటీలో కంప్యూటర్ ఇంజనీరింగ్ విభాగంలో మెరిట్ స్కాలర్‌షిప్‌తో సీటు సాధించాడు. యూనివర్సిటీ ర్యాంకింగ్స్‌లో ప్రతిభ కనభరచిన నిఖిల్ వర్ధన్ రెడ్డికి మాజీ మంత్రితో పాటు పలువులు అభినందనలు తెలిపారు.

హాస్టల్ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు : తమ పరిధిలోని నాలుగు మండలాల్లోని హాస్టల్లో చేరడానికి అర్హులైన విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏఎస్ డబ్ల్యూ ఓ షకీలా కోరారు. ఆమె ఆదివారం ఓ పత్రిక ప్రకటన విడుదల చేశారు. గంగాధర నెల్లూరు, పూతలపట్టు, పెనుమూరు, ఎస్‌ఆర్‌పురం మండలాల్లోని బాలుర, బాలికల, హాస్టల్స్‌లో ఎస్సి, ఎస్‌టి, బిసి, ఓసి మైనార్టీకి చెందిన పేద విద్యార్థులు హాస్టల్లో 3 నుంచి 10 తరగతి వరకు సీట్ల కోసం దరఖాస్తులు చేసుకోవచ్చున్నారు. మిగిలిన వివరాల కోసం ఆయా హాస్టల్ వద్ద వివరాలు తెలుసుకోవచ్చని ఆమె పేర్కొన్నారు. హాస్టల్లో చేరే విద్యార్థులకు విద్యా సామగ్రి, ట్రంక్ బాక్స్, స్టడీ మెటీరియల్, దుప్పట్లు, కార్పెట్లు అందిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు.

'నిబంధన'ను తొలగించాలి

ఏపీ ఎన్‌జీవో సంఘం డిమాండ్

ప్రజాశక్తి - పలమనేరు: పలమనేరు: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలను ప్రభుత్వం అమలు చేస్తున్న నేపథ్యంలో "మండలాన్ని యూనిట్‌గా తీసుకుని అదే మండలంలో పని చేయకుండా చేసిన నిబంధన"ను వెంటనే ఉప సంహరించు కోవాలని ఏపీ ఎన్జీజీవో సంఘం పలమనేరు తాలూకా అధ్యక్షుడు ఆనందబాబు, కార్యదర్శి జయమ్మ డిమాండ్ చేశారు. ఈ నిబంధన కారణంగా పలువురు చిరుద్యోగులు, మరీ ముఖ్యంగా మున్సిపాలిటీ పరిధిలో విధులు నిర్వహిస్తున్న వారు సుదూర ప్రాంతాలకు బదిలీ అయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయని వారు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆ విభాగం ఉద్యోగులు ఆందోళనలు వ్యక్తం చేస్తున్న వేళ ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మీపతి యాదవ్, రాష్ట్ర గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు హరి, జిల్లా అధ్యక్షుడు రమణ, సంఘ నాయకులు హైదర్, దాము పాల్గొన్నారు.

అరకొర వసతులు

- తప్పని అగచాట్లు
- మరుగుదొడ్ల నిర్వహణ లేక విద్యార్థుల అవస్థలు
- మౌలిక వసతుల కల్పనలో నిర్లక్ష్యం
- అగమ్యగోచరంగా విద్యార్థుల పరిస్థితి

మరుగుదొడ్లు అస్తవ్యస్తంగా వున్న వెదురుకుప్పం పాఠశాల

30కి పైగా పాఠశాలల్లో ఇదే పరిస్థితి

ప్రజాశక్తి - వెదురుకుప్పం: ప్రభుత్వ పాఠశాలల్లో తగిన మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కనీసం మరుగుదొడ్ల నిర్వహణ లేక ఇబ్బందులు తప్పడం లేదు. పాఠశాలలో కనీసం నీటి సౌకర్యం కూడా లేని దుస్థితి ఏర్పడింది. ఆరుబయటే మూత్ర విసర్జనకు వెళ్లాల్సిన పరిస్థితి..ఎవరిని అడగాలో.. ఎవరికి చెప్పుకోవాలో కూడా తెలియని చిన్నతనంలో ఆ విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులైనా స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. కనీసం నీటి సౌకర్యం కూడా కరువైంది.

మౌలిక సదుపాయాలు కల్పించాలి..

పాఠశాలలో విద్యార్థులకు కనీస మౌలిక సౌకర్యాలు కల్పించాలి. మెరుగైన విద్యను అందించాలి. మరుగుదొడ్లు అందుబాటులోకి తేవాలి. నీటి సౌకర్యం తప్పని సరిగా ఏర్పాటు చేయాలి. విద్యాభివృద్ధికి పాలకులు పార్టీలకు అతీతంగా పనిచేయాలి.

- వాసుదేవరెడ్డి, పచ్చికాపలం, వెదురుకుప్పం మండలం.

వెదురుకుప్పం మండలంలో 30కి పైగా పాఠశాలల్లో అరకొర సదుపాయాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి వుంది. మరుగుదొడ్ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారి కనీసం పాఠశాల విద్యార్థులను పట్టించుకునే నాథుడు కూడా కరువయ్యారు. ప్రధానంగా గొడుగు చింత, చద్దికూళ్లపల్లి, ఎర్రగుంట ప్రాథమిక ప్రాథమిక పాఠశాలల్లో పూర్తిగా మరుగుదొడ్లు లేవు. కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరు తున్నారు..

జిల్లా అధికారులకు నివేదిక పంపించాం..

వివిధ పాఠశాలల్లో మరుగుదొడ్లు లేని పరిస్థితి వాస్తవమే.. నాడు- నేడు పనుల ద్వారా చాలా వరకు మరుగుదొడ్లకు మరమ్మతులు చేశాం..ఇబ్బందులు వున్న చోట్ల మరమ్మతులు, నూతన మరుగుదొడ్ల నిర్మాణం, నీటి సౌకర్యం ఏర్పాటుకు సంబంధించి నివేదికలు జిల్లా ఉన్నతాధికారులకు పంపించాం..ఆమోదం వచ్చిన వెంటనే సమస్యలు పరిష్కరిస్తాం..

-మహేశ్వరరాజు, ఎంఈవో, వెదురుకుప్పం.

జ్ఞాన దీపాలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

జ్ఞాన దీపాలు పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి -గంగవరం: గంగవరం పంచాయతీ సాయి గార్డెన్ టీలో ఉన్న తెలుగు సాంస్కృతిక సేవా సమితి కార్యాలయంలో తులసినాధం నాయుడు రచించిన జ్ఞాన దీపాలు పుస్తకాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తులసీనాధం నాయుడు మాట్లాడుతూ బాల్య దశ నుండి విద్యార్థులకు చదువుతో పాటు జ్ఞానాన్ని సంపాదించే అన్ని విషయాలు ఇందులో పొందుపరిచారని మండలంలోని ప్రతి పాఠశాల విద్యార్థులకు ఉచితంగా వీటిని పంపిణీ చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఉష, విద్యార్థులు, పలువురు వక్తలు పాల్గొన్నారు.

తారు రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

నలసానపల్లికి తారు రోడ్డు మంజూరు

ప్రజాశక్తి -గంగవరం: గంగవరం మండలం కీలపట్ల గ్రామ పంచాయతీలోని నలసానపల్లి గ్రామంలో ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ఆధ్వర్యంలో చెరువు కట్టపై తారురోడ్డు పనులు ఆదివారం ప్రారంభించారు. అమరనాథరెడ్డి ఇచ్చిన మాట ప్రకారం తమ ఊరికి తారురోడ్డు వేయించారని గ్రామస్తులు అన్నారు. 40 సంవత్సరాల తమ గ్రామ ప్రజల చిరకాల వాంఛను నిజం చేసిన అమరనాథరెడ్డికి ఎప్పుడూ రుణపడి ఉంటామని కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

అందని సేవలు!

- కనిపించని సచివాలయ ఉద్యోగులు
- ప్రజలకు తీవ్ర కష్టాలు
- అధికారులు స్పందించాలని వినతి

ప్రజాశక్తి -నగరి : నగరి పట్టణ, రూరల్ మండల గ్రామ సచివాలయ సిబ్బంది సక్రమంగా విధులకు హాజరు కాకపోవడంతో వివిధ సమస్యల పరిష్కారానికి వచ్చిన ప్రజలు తీవ్ర కష్టాలు ఎదుర్కొంటున్నారు. జిల్లా స్థాయి అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు అభ్యర్థిస్తున్నారు.

కనిపించని సచివాలయ ఉద్యోగులు

కేంద్ర ప్రభుత్వం శనివారం చేపట్టిన యోగా దినం సందర్భంగా ఆ రోజు సచివాలయాల ఉద్యోగులు 7 గంటలకు వచ్చి 8 గంటల వరకు యోగా కార్యక్రమం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఆ యోగా కార్యక్రమం అడ్డు పెట్టుకుని సచివాలయ సిబ్బంది 11 గంటలకే ఇంటికి వెళ్లిపోయారు. ఎం కొత్తూరు, నంబకం, గుండ్రాజకుప్పం, బీరకుప్పం, తెరణి సచివాలయాలతో పాటు పలు సచివాలయాలు కూడా మూసివేసిన పరిస్థితి ఏర్పడింది. దీంతో సచివాలయానికి వచ్చిన స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నగరి పట్టణ, రూరల్ మండలంలో మొత్తం 13 సచివాలయాలు ఉండగా అందులో నాలుగు సచివాలయాలు తప్ప మిగిలిన 9 సచివాలయాలు మధ్యాహ్నానికే 11 గంటలకే మూత పడ్డాయి. అంతే కాకుండా గ్రామానికి చెందిన అర్జీదారులు, కొత్త రేషన్ కార్డు కోసం వచ్చిన వాళ్లు అధికారులకు ఫోన్ చేయగా సచివాలయం సిబ్బంది 'అక్కడ ఉన్నా..ఇక్కడ ఉన్నా..' అంటూ పై అధికారులను సమాధానం చెప్పి బురిడి కొట్టిస్తున్నట్లు సమాచారం.

ఉదయం 11 గంటలకే వెళ్లిన ఎంకొత్తూరు సచివాలయ సిబ్బంది

హాజరులో గోల్‌మాల్!

సచివాలయాల సిబ్బంది ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం బయోమెట్రిక్ ద్వారా హాజరు వేయాల్సి వుంఇ. కానీ ఇది ఎక్కడా అమలు కావడం లేదు. సచివాలయ సిబ్బంది పది సెకండ్ల వీడియో చిత్రీకరించి తన సహ ఉద్యోగికి వాట్సాఆప్ ద్వారా అందిస్తాడు. ఆ వీడియో ఆధారంగా బయోమెట్రిక్ వేసి ఉన్నాతాధి కారులను మాయచేసి మోసం చేస్తున్నారనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికారులు వెంట నే సచివాలయ సిబ్బందిపై దృష్టి పెట్టి ప్రజలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

మూతపడిన ఎంకొత్తూరు సచివాలయం

మూతపడిన నంబాకం గ్రామ సచివాలయం

పాడి రైతులకు చేయూత

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు:

కూటమి ప్రభుత్వంలో పాడి రైతులకు అన్ని విధాల చేయూత అందిస్తోందని టీడీపీ పార్లమెంట్ కార్య నిర్వాహక కార్యదర్శి కృష్ణమ నాయుడు అన్నారు. మండల కేంద్రం గంగాధర నెల్లూరు పశుసంవర్ధక శాఖ ఏడి కార్యాలయంలో పలువురు రైతులకు సబ్సిడీతో పశువుల దాణా బస్తాలను అధికారులు, నేతలతో కలిసి కృష్ణనాయుడు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడిఆవుల కోసం గోకులం షెడ్ లు రైతులకు మంజూరు చేయగా, వాటి దాహార్తి తీర్చడానికి పలు గ్రామాల్లో నీటి తొట్టెలు ఎక్కువ సంఖ్యలో మంజూరు చేసి వాటిని నిర్మించి ప్రభుత్వం అన్ని విధాల చేయూత అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ ఇన్చార్జి డిడి అబ్దుల్ ఆరిఫ్, గంగాధర నెల్లూరు ఏడి మురళీమోహన్, టిడిపి నేతలు శ్రీధర్ యాదవ్ ,స్వామి దాస్ , దేవ సుందరం, హరీష్ యాదవ్, మోహన్ నాయుడు, అశోక్ నాయుడు, దేవరాజు రెడ్డి, దాసర పల్లి శంకర్, పశువైద్య సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

జీతాల బిల్లుల మంజూరులో లోపాలు సరిదిద్దాలి

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్:

ఇటీవల టీచరు పోస్టుల సర్దుబాటు, బదిలీలు, ఉద్యోగోన్నతులు జరిగిన నేపథ్యంలో..జీతాల బిల్లుల మంజూరులో సాంకేతిక ఇబ్బందులు తలెత్తకుండా క్యాడర్ స్ట్రెంగ్త్ వివరాలను ఖజానా శాఖకు అందించేలా తగిన చర్యలు తీసుకోవాలని ఎస్‌టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గంటా మోహన్ కోరారు. ఈమేరకు ఆయన, ఆదివారం మధ్యాహ్నం చిత్తూరులో జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మి ని కలిసి ఒక లేఖను అందించారు. అన్ని పాఠశాలల్లో టీచరు పోస్టుల తాజా వివరాలు, అన్ని స్థాయిలలో ఖజానా శాఖకు అందాల్సి ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. సకాలంలో జీతాల బిల్లులు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. డిఈఓ మాట్లాడుతూ, క్యాడర్ స్ట్రెంగ్త్ వివరాలు సకాలంలో అందించేందుకు పూర్తి చర్యలు చేపట్టామని తెలిపారు. ఆ ప్రక్రియలో సిబ్బంది నిమగ్నం అయ్యారని తెలిపారు. ఇటీవలి బదిలీ కౌన్సెలింగ్ ప్రక్రియకు సంబంధించి వచ్చిన అన్ని గ్రీవెన్స్‌ను క్రోడీకరించి ఉన్నతాధికారులకు పంపామని తెలిపారు. ఉన్నతాధికారుల నుండి వచ్చే ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నేమ్ బోర్డులు లేని వెలుగు, ఉపాధి హామీ కార్యాలయం

అమలు కాని సహకార హక్కు చట్టం

- నేమ్ బోర్డులు కరువు
- దుస్థితిలో వెలుగు, ఉపాధి హామీ కార్యాలయాలు

ప్రజాశక్తి-పలమనేరు:

పలమనేరు లో వెలుగు, ఉపాధి హామీ కార్యాలయాలకు సమాచార హక్కు చట్టానికి నోచుకో లేని పరిస్థితులు నెలకొన్నాయి. కార్యాలయం నేమ్ బోర్డు లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు అద్దం పడుతోంది. ఉన్నతాధికారులకు ఛాలెంజ్ విసురుతున్న అధికారులు నిర్లక్ష్యపు నీడలో విధులు నిర్వహిస్తూ ప్రజలను, ప్రభుత్వాన్ని ధిక్కరిస్తోంది. అధికార గణం పట్టించుకుని ఉన్నత అధికారులు కనికరించి ప్రజలకు , ప్రభుత్వానికి అనుగుణంగా అందుబాటులో ఉండాల్సిన ఈ ప్రభుత్వ సంస్థలు ప్రభుత్వ అధికారులను స్థానిక ప్రజాప్రతినిధులు సైతం లెక్కచేయని పరిస్థితులు నెలకొన్నాయి. ఈ విషయంలో ఉన్నతాధికారులు స్పందించాలి సమాచార హక్కు చట్టం, నేమ్ బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలకు అందుబాటులో తీసుకురాలేదు నిర్లక్ష్మంగా వ్యవహరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సమాచార హక్కు చట్టం ఉద్యమకారులు టి మునిరత్నం, గిరి, సుబ్రహ్మణ్యం, శివ , ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కుక్క కాట్లు ఆగేదెప్పుడో?

- అధికారుల నిర్లక్ష్యం
- బెంబేలెత్తుతున్న ప్రజలు

ప్రజాశక్తి -బంగారుపాళ్యం:
బంగారుపాళ్యం పట్టణంలో కుక్కల బెడద అధికంగా వుంది. వీటి సంతానోత్పత్తిని అరికట్టి కుక్కల బెడద నుండి రక్షించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అధికారుల్లో చిత్తశుద్ధి కరువవడంతో వీధుల్లో కుక్కలు అధికమయ్యాయి. మండలంలోని తగువారిపల్లి ,మేధర వీధి, జాతీయ రహదారిపై కుక్కలు వందల సంఖ్యలో యథేచ్ఛగా వీధుల్లో సంసరిస్తున్నాయి. వీధిలో వెళు తున్న వాహన దారులను, చిన్నపిల్లలను అవి గాయపరిచి భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. రోడ్లపై వెళుతున్న వాహనాలకు అడ్డంగా రావడం వల్ల వాహనదారులు కిందపడి ప్రమాదాలు కొని తెచ్చుకోవాల్సి వస్తోంది. ఇటు వాహనానికి అటు మనిషికి తీవ్ర నష్టం కలిగి స్తున్నాయి. స్పందించాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహ రిస్తుండడంతో ఏ వీధిలో చూసినా కుక్కలు బెంబేలెత్తిస్తున్నాయి. ఇకనైనా సంబంధిత పంచాయతీ అధికారులు గ్రామ కుక్కల నివారణకు చేపట్టాల్సి సంతానోత్పత్తిని అరి కట్టేందుకు అనుసరించాల్సిన చర్యలు చేపటి కుక్కలను నిరోధించి స్థానికులను ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు. గతంలో పలుమార్లు వీధుల్లో వెళుతుండగా పలుసార్లు దాడి చేయడంతో పలువురు గాయాలపాలై ఆస్పత్రి పాలవుతున్నారు. వెంటనే పంచాయతీ అధికారులు స్పందించి కుక్కల బెడద నుండి రక్షించాలని స్థానికులు అభ్యర్థిస్తున్నారు.

పట్టణంలోని వీధుల్లో గాయపరుస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్న కుక్కలు

రచయిత బాలాజీకి సడ్లపల్లె కథా పురస్కారం

ప్రజాశక్తి-పలమనేరు: స్థానిక కవి, రచయిత పెద్దపంజాణి ఎంపీడీవో పలమనేరు బాలాజీ తన ఏకలవ్య కాలనీ కథా సంపుటికి హిందూపురంలో ఆదివారం నిర్వహించిన సభలో తపన సాహిత్య వేదిక నుండి సడ్లపల్లె కథా పురస్కారాన్ని అందుకున్నారు. ప్రముఖ కథా రచయితలు సడ్లపల్లి చిదంబర రెడ్డి, శశికళ, శాంతి నారాయణ , స్వర్ణ కిలారి, ఈశ్వర రెడ్డి, డాక్టర్ ఎం ప్రగతి, చాంద్ బాషా , కైమలి, గండికోట వారిజ, హిందూపురం డి.ఎస్.పి. కె.వి మహేష్, ప్రముఖ వైద్యానిపుణులు డాక్టర్ ఎనమదల మురళీకృష్ణ పాల్గొన్నారు. ఎరుకల జన జీవితాలను, వారి గుండె చప్పుళ్లను, కన్నీళ్లను, ఆత్మగౌరవ పోరాటాలను ఏకలవ్య కాలనీ కథల ద్వారా ప్రపంచానికి కళ్లకు కట్టినట్టుగా రచయిత తెలియ చెప్పారని అందుకే ఈ కథా సంపుటికి బహుజన సాహిత్య పురస్కారం, గీతాంజలి స్మారక పురస్కారం, కెనడా తెలుగు తల్లి పురస్కారం, సడ్లపల్లె కథా పురస్కారం లభించాయని సమీక్షకులు సహ ఆచార్య జి యమునా రాణి అన్నారు. ఇన్నేళ్ల తెలుగు సాహిత్యంలో తొలి ఎరుకల కథా సంపుటిగా ఏకలవ్య కాలనీ ఒక మలుపు అని ఆమె అన్నారు. తెలుగు సాహిత్యంలో ఎరుకల జన జీవితాలను చిత్రీకరించిన తొలి రచయిత పలమనేరు బాలాజీ అని వక్తలు ప్రశంసించారు. తన రచనలకు , తెలుగు సాహిత్య రంగంలో మూడు దశాబ్దాలకు పైగా చేస్తున్న కృషికి పలమనేరు బాలాజీ రెండుసార్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగు భాషా పురస్కారాన్ని ముఖ్యమంత్రి చేతుల మీదుగా అందుకున్నాడు.

కథా, కవితా , నవలా ప్రక్రియలలో

స్మైల్ పురస్కారం, కందుకూరి వీరేశలింగం పంతులు స్మారక పురస్కారం, తెలుగు విశ్వవిద్యాలయ పురస్కారం, నూతలపాటి గంగాధరం పురస్కారం, మాడభూషి రంగాచార్య స్మారకపురస్కారాలను, హోసూరు ఉగాది పురస్కారాలను అందుకున్నారు. పురస్కార గ్రహీత పలమనేరు బాలాజీని పలువురు రచయితలు, సాహితీవేత్తలు ప్రశంసించారు.

రచయిత బాలాజీని సన్మానిస్తున్న ప్రముఖులు

అలరించిన దుర్యోధన వధ ఘట్టం

ప్రజాశక్తి - గంగాధరనెల్లూరు: గంగాధరనెల్లూరు మండలం బాలగంగనపల్లెలో ద్రౌపది సమేత ధర్మాజులు మహాభారత వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం నిర్వహించిన దుర్యోధన వధ ఘట్టం పలువురికి అలరించింది. బాలాజీ రెడ్డి భీముని పాత్ర ధరించగా, దేవేంద్ర దుర్యోధన పాత్రను ధరించి ఒకరి కొకరు తలపడ్డారు. వారు ప్రదర్శించిన దుర్యోధన వధ ఘట్టం పలువురిని ఆకట్టుకుంది. ఆలయం వద్ద ఆదివారం రాత్రి అగ్నిగుండ ప్రవేశం నిర్వహించారు. పలువురు భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

దుర్యోధన వధ ఘట్టాన్ని తిలకిస్తున్న భక్తులు

పారిశ్రామికవాడగా పాతపాళ్యం

- -2 వేల మందికి ఉద్యోగ అవకాశాలు
- - ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : ఎస్ఆర్ పురం మండలం పాతపాళ్యం గ్రామాన్ని పారిశ్రామిక వాడగా ఏర్పాటు చేపి తద్వారా దాదాపు రెండు వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని గంగాధర నెల్లూరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ బిఎం థామస్ అన్నారు. ఆదివారం పరిశ్రమల ఏర్పాటుకు ఆయన స్థల పరిశీలన చేశారు. చిత్తూరు తర్చూరు జాతీయ రహదారి , పరిధిలో గంగాధర నెల్లూరు మండలం బాలగంగన పల్లి, పద్మాపురం , ఎస్ఆర్ పురం రెవెన్యూలో పాతపాలెం దాసరిగుంట, సింధూ రాజపురం భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఆర్ పురం రెవెన్యూలో పాతపాలెం వద్ద ప్రభుత్వ భూములు ఉన్నాయని పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలంగా ఉంటుందన్నారు.

పరిశ్రమలు ఏర్పాటుపై అక్కడ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. పరిశ్రమలు ఏర్పాటుకు రైతులు భూములు ఇవ్వడానికి స్వచ్ఛందంగా ముందుకు రావడం తో ఆనందం వ్యక్తం చేశారు. మా గ్రామంలో పరిశ్రమలు వస్తే ఉద్యోగాలు వస్తాయని, మా పరిసర ప్రాంతాల గ్రామీణ ప్రజలు అభివృద్ధి సాగుతోందని రైతులు చెప్పడంతో ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు ఇది శుభ పరిణామన్నారు. ఎస్ఆర్ పురం పరిధిలో రెండు పరిశ్రమలు బయోటెక్ పరిశ్రమ పాలీహౌస్ పరిశ్రమ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. త్వరలో పరిశ్రమలకు సంబంధించిన టీం స్థలాన్ని పరిశీలి స్తారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే థామస్